క్లుప్తంగా

కనుల పండువగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం



భట్టిప్రోలు: అయ్యప్పస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భట్టిప్రోలు పురవీధుల్లో అయ్యప్ప స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై మాలధారులు శరణు ఘోషతో కనుల పండువగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే గేట్ సమీపంలోని అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి గ్రామోత్సవాన్ని స్థానిక అభయాంజనేయస్వామి వారి దేవాలయం నుంచి ప్రారంభించారు. కమిటీ నిర్వాహకులు అక్కల హరి గురుస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గురు పీఠం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి సాయిబాబా మందిర వార్షికోత్సవాలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో నిర్వహించనున్న 80వ వార్షికోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు తమ్మన రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా సాయినాథునికి సుగంధ ద్రవ్యాలతో మంగళ స్నానం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, సాయిబాబాకు ఏకాదశ రుద్రాభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు.

మాజీ సైనికునికి ఘన స్వాగతం



దుండివారిపాలెం(కర్లపాలెం): భారత సైన్యంలో చేరి దేశానికి విశేష సేవలందించి పదవీ విరమణ చేసి బుధవారం స్వగ్రామం ఎంవీరాజుపాలెం వచ్చిన హవల్దార్ పిట్టు రవికుమార్‌రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికి పూల మాలలు, శాలువాలతో చిరు సన్మానం చేశారు. కర్లపాలెం మండలం ఎంవీరాజుపాలెం గ్రామానికి చెందిన పిట్టు రవికుమార్‌రెడ్డి 22 ఏళ్ల పాటు సైనికునిగా సేవలందించి డిసెంబర్ 31న పదవీ విరమణ చేశారు. బుధవారం స్వగ్రామం వచ్చిన సందర్భంగా గ్రామస్తులు, మాజీ సైనికులు, యువకులు రవికుమార్‌రెడ్డి దంపతులను ముకుంద టీ స్టాల్ నుంచి అతని ఇంటి వరకు ర్యాలీగా తీసుకువచ్చి ఘనంగా సన్మానం చేశారు. తను ఊహించని విధంగా స్వాగత సత్కారాలు చేసిన గ్రామస్తులకు, మాజీ సైనికులకు రవికుమార్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

హ్యాపీ న్యూ ఇయర్ మేడమ్



తెనాలి: నూతన సంవత్సరం డివిజనులోని ప్రజలంతా సుఖశాంతులతో హాయిగా జీవించాలన్న ఆకాంక్షను తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహా వ్యక్తం చేశారు. 2025 సంవత్సరం తొలిరోజున డివిజన్‌లోని పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బందితోపాటు వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, స్థానికులు సబ్‌కలెక్టర్‌ను కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. వీరిలో తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, దుగ్గిరాల తహసీల్దార్ సునీత, కొల్లిపర తహసీల్దార్ సిద్ధార్థ, కాకుమాను తహసీల్దార్ వెంకటస్వామి, పొన్నూరు తహసీల్దార్ జియావుల్‌హక్, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీధర్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్మయి, పద్మ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సీతఈపీఓ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఉన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: గర్భిణులు సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలుగుతారని బఫర్ వైద్యురాలు శాంతి అన్నారు. మండలంలోని రేపూడి గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. 95మందికి షుగర్, బీపీ, థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయించుకోవాల్సిన ఆరోగ్య పరీక్షలు గురించి అవగాహన కల్పించారు. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకొని మందులు వాడుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, ఏఎన్ఎంలు వెలగంగిణీ రాణి, శివకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు



ఇరిగేషన్ కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం



అద్దె గృహంలో డీఎస్పీ కార్యాలయం

రేపల్లె రూరల్: డివిజన్ కేంద్రమైన రేపల్లెలో పలు ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. తీర ప్రాంతమైన రేపల్లె నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రేపల్లెను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసింది. దీంతో రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, వేమూరు, భట్టిప్రోలు, చుండూరు, అమృతలూరు కొల్లూరు తొమ్మిది మండలాలను కలిపి రెవెన్యూ డివిజన్‌గా 2022 ఆగస్టులో ఏర్పాటు చేసింది. ప్రకటించిందే తడవుగా అన్ని శాఖల డివిజన్ కార్యాలయాలను అప్పటి ప్రభుత్వం రేపల్లె పట్టణంలో నెలకొల్పింది. పౌర సేవలు ప్రజలకు అందాలన్న లక్ష్యంతో పలు ప్రభుత్వ కార్యాలయాలను అద్దె భవనాల్లో ఏర్పాటు చేసి సేవలు అందించింది. ప్రధానంగా రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, పోలీసు డివిజనల్ కార్యాలయం భవన నిర్మాణాలకు స్థలాలను ఎంపిక చేసింది. భవన నిర్మాణాలకు నిధులు కేటాయించి శ్రీకారం చుట్టే సమయానికి ఎన్నికల కోడ్ రావడం, ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం రావడంతో ఈ ప్రక్రియ మరుగున పడింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచినా ప్రధాన కార్యాలయాలకు శాశ్వత భవనాల ఏర్పాటుపై చర్యలు చేపట్టకపోవటంతో ప్రజా సంఘాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి.



మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పై భాగంలో శాఖ గ్రంథాలయం

ప్రధాన కార్యాలయాలు అద్దెభవనాల్లోనే..

రెవెన్యూ డివిజనల్ కార్యాలయంను ఇరిగేషన్ కార్యాలయంలో నడుపుతుండగా.. డీఎస్పీ కార్యాలయాన్ని ఉప్పూడి రోడ్డులోని అద్దె గృహంలో నడుపుతున్నారు. ఆయా భవనాలు విశాలంగా లేకపోవటంతో పలు సమస్యలను అధికారులకు తెలిపేందుకు వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అదేవిధంగా చంద్రమౌళి పార్కులోని శాఖ గ్రంథాలయం శిథిలావస్థకు చేరటంతో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. గ్రంథాలయానికి సైతం సొంత భవన నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

భట్టిప్రోలులో మొరాయించిన రైల్వే గేట్

గంట సేపు నిలిచిన వాహనాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు రైల్వే గేట్ మొరాయించడంతో బుధవారం ఉదయం బాపట్ల–భట్టిప్రోలు–వెల్లటూరు (బీబీవీ) రహదారి మార్గంలో గంట సేపు వాహనాలు నిలిచిపోయాయి. ఇంటర్నల్ గేట్‌ను ఓ వాహనం ఢీకొట్టడంతో గేట్ సరిగా పని చేయక పోవడంతో గేట్ మెన్ గుంటూరు నుంచి రేపల్లె వైపు వెళుతున్న రైలుకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు నాన్ ఇంటర్నల్ గేట్‌ను వేసి తీసే క్రమంలో ఓ గేట్ లాక్ రాకపోడంతో వాహనాలు ఇరు వైపులా భారీ సంఖ్యలో నిలిచి పోయాయి. గేట్ పరిస్థితిని స్టేషన్ మాస్టర్ రైల్వే ఉన్నత అధికారులకు తెలియజేయడంతో గేటు తీసేందుకు ప్రత్యేక సిబ్బందిని భట్టిప్రోలు పంపారు. అప్పటికే వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు ఎన్‌హెచ్ 216ఏ రహదారి మార్గంలోని సూరేపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైగా రాకపోకలు కొనసాగించారు. గేట్ మొరాంచడంతో వాహనదారులు కింద, పక్కన ఉన్న ఇరుకు మార్గంలో తరలి వెళ్లారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య సిబ్బందిని పంపించి ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు. లాక్ రాకపోవడంతో సిబ్బంది తాత్కాలికంగా సిస్టమ్ మొత్తాన్ని తొలగించి గేట్‌ను పక్కకు తీయడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా జరిగాయి.



రైల్వే గేట్ మొరాయించడంతో నిలిచిన ట్రాఫిక్



గేట్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

విధులకు ఆటంకం కలిగించిన యువకులపై కేసు

తెనాలి రూరల్: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకులపై కేసు నమోదైంది.వివరిలిలా ఉన్నాయి. తెనాలి వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాటాక రౌండ్స్‌కి తిరుగుతున్న సందర్భంలో రామలింగేశ్వరపేట పాత డిపో సెంటర్ వద్ద నలుగురు యువకులు మద్యం తాగి హల్‌చల్ చేస్తున్నారు. అదే సమయంలో పోలీసులు వెళ్లగా వారితో ఘర్షణకు దిగి వాహనాన్ని అడ్డుకున్నారు.ఈ నేపథ్యంలో నలుగురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కొల్లూరు: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు గురువారం మండలంలోని ఇరు గ్రామాలలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. మండలంలోని రావికంపాడులో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, క్రాపలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భూమి, రెవెన్యూ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్ అందజేత

భట్టిప్రోలు: నూతన సంవత్సరం పురస్కరించుకుని విశ్రాంత ఉపాధ్యాయుడు కేఎల్ కాంతారావు, ముస్లిం మత పెద్ద ఆరిఫుల్లా ఖాన్‌లు బుధవారం విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేశారు. స్థానిక లూథరన్ ఎలిమెంటరీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఎంఈవో నీలం దేవరాజు చేతుల మీదగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గుర్రం వెంకట సుబ్బారావు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకామాక్షి స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ఎంపిక



బాపట్ల: శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం మండల నూతన కార్యవర్గం ఎంపిక బుధవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా మోగంటి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పఠాన్ అన్వర్‌ఖాన్, సెక్రటరీగా పఠాన్ జిలానీఖాన్, జాయింట్ సెక్రటరీగా షేక్ అబ్దుల్ జమీర్, ట్రెజరర్‌గా వాసాభక్తుల లక్ష్మీనారాయణలను ఎంపిక చేసుకున్నారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా తరిణి రాజేష్, కందేపి శ్రీనివాసు, వి.సంతోష్‌కుమార్ ఉన్నారు.

వాడవాడలా నూతన సంవత్సర వేడుకలు

రేపల్లె రూరల్: నూతన సంవత్సర వేడుకలను నియోజకవర్గంలో వాడవాడలా బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల మధ్య ఇంటి వాతావరణంలో వైభవంగా నిర్వహించుకున్నారు. అదే విధంగా యువత కేరింతలు, ప్రధాన రహదారుల్లో సందడి చేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఆయా రాజకీయ పార్టీల కార్యాలయాల్లో కేక్‌లు కట్ చేశారు.

ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నిండాలి

కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నిండాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కొత్త ఆలోచనలు, కొత్త లక్ష్యాలతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి గణేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు కరేటి శేషగిరి రావు, మేడికొండ అనిల్, చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, కాటూరి శివనాగబాబు, బగ్గారెడ్డి, రవిరెడ్డి, రాజశేఖర్, కాశీప్రభాకర్, నాగేశ్వరరావు, ఇంకొల్లు రామకృష్ణ, కొండలురెడ్డి, నీలా నాంచారయ్య, షేక్ లియాకత్‌బాషా, చదలవాడ శ్రీనివాసరావు, ప్రవీణ్‌కుమార్, వై.రాంబాబు, కరుణానిధి, నిజాంపట్నం కోటేశ్వరరావు, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో...

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కార్మికులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కమిషనర్ కాకర్ల సాంబశివరావు కట్ చేసి అనంతరం మాట్లాడారు. గతంలో మన జీవితాల్లో చోటు చేసుకున్న తీపి, చేదు గుర్తులను తమ జీవితానుభవాలుగా నెమరువేసుకోవాలన్నారు. బంగారు భవిష్యత్తై ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు. అదేవిధంగా తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎం.శోభారాణి, పట్టణ సీఐ మల్లికార్జునరావు, రూరల్ సీఐ సురేష్‌బాబు, ఏడీఏ ఆర్.విజయ్‌బాబు, పట్టణాభివృద్ధి సంఘ కార్యదర్శి సీవీ మోహనరావు, రసాలయ కళా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కోడి గౌరీశంకర్, పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్, సీపీఐ ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పి.నాగాంజనేయులు, సీపీఎం డివిజన్ కార్యదర్శి మణిలాల్ తదితరులు పట్టణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ తీర్చిదిద్దిన రంగవల్లులు

ఆలయాల్లో నూతన సంవత్సర పూజలు

రేపలె రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణం, మండలంలోని వివిధ దేవాలయాల్లో బుధవారం ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ దేవత బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో, రైలుపేట 8వ వార్డులోని సాయినాథుని ఆలయంలో, ఇసుకపల్లి భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి, ఓల్డ్ టౌన్‌లోని ఉమామహేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా న్యూ ఇయర్‌కు స్వాగతం

భట్టిప్రోలు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ వాడవాడలా నూతన సంవత్సర వేడుకలను బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు మండలంలోని 15 గ్రామాలలోని చర్చిల వద్ద, ప్రధాన కూడళ్ల సెంటర్లలో యువకులు డ్యాన్సులతో ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. మండల పరిషత్, పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారికి ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, ఎస్ఆర్ఈజీఈఎస్ మండల సమాఖ్య, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కర్లపాలెం మండలంలో...

కర్లపాలెం: నూతన సంవత్సర వేడుకలు బుధవారం మండలంలో ఘనంగా జరిగాయి. నూతన సంవత్సర వేడుకలలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యారం వనజకు ఎంపీడీవో శ్రీనివాసరావు, పలువురు అధికారులు ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. యూటీఎఫ్ నాయకులు ఎంపీపీ వనజను కలసి యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావుకు పలువురు అధికారులు ప్రజా ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ సుందరమ్మకు శుభాకాంక్షలు తెలిపారు. యువకులు మంగళవారం రాత్రి బాణసంచా కాల్చి ఘనంగా న్యూ ఇయర్ వేడుకలను జరుపుకున్నారు.



మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

బాపట్లలో...

బాపట్ల: నూతన సంవత్సర వేడుకలు కోలాహలంగా బుధవారం జరిగాయి. అర్ధరాత్రి నుంచే యువత నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. వ్యాపారస్తులు దుకాణాలను అలంకరించుకున్నారు. మహిళలు ముగ్గులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. నాయకుల ఇళ్ల వద్ద అభిమానులతో సందడి వాతావరణం నెలకొంది. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ బేతనీకాలనీలోని చర్చిలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజుకు స్థానిక టీడీపీ కార్యాలయంలో శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్ కటింగ్‌లో పాల్గొన్నారు. మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మిని కాంగ్రెస్ పార్టీ నాయకులు లేళ్ల వెంకటప్పయ్య, నాయకులు మద్దిబోయిన తాతయ్యలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు

నిజాంపట్నం: నూతన సంవత్సరంలో ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఆకాంక్షించారు. మండలంలోని బొర్రావారిపాలెంలో కేసన శంకరరావు నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు జిల్లాల నుంచి బీసీ సంఘ నాయకులు, అభిమానులు తరలివచ్చి శంకరరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శంకరరావు మాట్లాడుతూ పాడిపంటలతో, సుఖసంతోషాలతో ప్రతి ఒక్కరికి శుభం కలగాలని అన్నారు. అనంతరం కేసన శంకరరావు దంపతులను బీసీ సంఘ నాయకులు గజమాలతో సత్కరించారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తొట్టెంపూడి బుచ్చి రామకృష్ణ, కాగితాల సుబ్బారావు, లుక్కా సోమేష్, పలు ప్రాంతాల బీసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కేసన శంకరరావు దంపతులను గజమాలతో సత్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు



యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్



ఎంపీపీ వనజకు డైరీ, క్యాలెండర్ అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు



ఎంపీపీ లలిత కుమారికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు



గ్రామ దేవత బూరుగులమ్మ ఆలయంలో భక్తులు

రైతుసంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

తెనాలి: ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, తెనాలి డివిజన్ కమిటీ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండరును తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రైతాంగానికి ఉపయోగపడేలా క్యాలెండర్‌ను తీసుకొచ్చిన కమిటీని అభినందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ మాట్లాడుతూ గతంలో గ్రామంలో కరణం, గ్రామ మోతుబరి దగ్గరే క్యాలెండర్ ఉండేదని, తిథి, వార, నక్షత్రాలతోపాటు వ్యవసాయ సంబంధమైన విషయాలను వారి ద్వారా తెలుసుకునే ఆనవాయితీ ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతాంగానికి ఉపయోగపడేలా క్యాలెండర్‌ను తీసుకురావటం సంతోషంగా ఉందన్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ 2025 సంవత్సరంలో రైతాంగానికి మేలు జరగాలని ఆకాంక్షించారు. మేకల చిట్టిబాబు, పసుపులేటి శివనాగేశ్వరరావు, ములకా శివకుమారి, షేక్ హుస్సేన్ వలి, కేవీ సత్యనారాయణ, ఎస్.రాజ్యలక్ష్మి, భీమవరపు చినరామిరెడ్డి, మాగంటి యల్లమందయ్య, తాటి వెంకటేశ్వర్లు, ఆరికా ప్రసాద్, జి.వెంకట సుబ్బయ్య, అనిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సబ్ కలెక్టర్ సంజనా సింహ

కోటి లలితా సహస్ర నామ పారాయణ ప్రారంభం



రేపల్లె రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రింగురోడ్డు వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కోటి లలితా సహస్ర నామ పారాయణం కార్యక్రమాన్ని నల్లూరు వృద్ధాశ్రమం నిర్వాహకుడు కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ లలితా సహస్ర నామ పారాయణం చేస్తూ అమ్మవారిని నవధాన్యాలతో ఈ నెల 10వ తేదీ ముక్కోటి ఏకాదశి వరకు అర్చించటం జరుగుతుందని చెప్పారు. తొమ్మిది రోజులలో ఒక్కో రోజు ఒక ధాన్యపు రాశితో పూజలు, 10వ రోజు ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. తొలి రోజు ప్రతి ఒక్కరూ అమ్మవారికి నవధాన్యాలలోని అలసందలతో పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మద్ది పద్మజ, కారుమూరి నాగ లీల, చంద్ర కిరణ్, నిడమానూరు నగరాజ, గుండు పుష్పవల్లి, సుగ్గల రామరత్నం, బొలిశెట్టి స్వతంత్ర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, బాపట్ల

OS No: 06/2024

Between:-
కత్తుల నిర్మల --- వాది
Vs
మానుకొండ శివరామశేషిరెడ్డి --- ప్రతివాది
ఋ॥ మానుకొండ శివరామశేషిరెడ్డి, తండ్రి సుబ్బారెడ్డి, భీమనంవారిపాలెం గ్రామం, పిట్టలవానిపాలెం మండలము, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు దావాలో మీరు ప్రతివాది అయివున్నారు. వాది అయిన కత్తుల నిర్మల మీ పై ప్రామిసరీ నోట్ తాలుకు బకాయి వసూళ్ళ నిమిత్తం పైన తెలిపిన దావా వేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ప్రతివాదికి నోటీసు జారీ చేయవలసినదిగా ఉత్తర్వులు జారీ చేసినారు. సదరు ఉత్తర్వుల ప్రకారం మీరు ది.21/01/2025వ తేదిన ఉదయం గం.10.30ని॥లకు కోర్టు వారి ఎదుట స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేనిచో మీ పరోక్షమున విచారించి మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా తెలియపరచడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది : 21/01/2025

కళ్ళం హరినాథ్‌రెడ్డి, వాది తరుపు న్యాయవాది, వివేకానంద కాలని, బాపట్ల